# తీరని కోరిక

* గతసంచిక తరువాయి *

[ పి. రామారావు ]

ఆ పితృహృదయంలో ప్రేమజ్యోతి యగు ఇందిర ఎల్లప్పుడును ప్రకాశించెడిది. చిన్నపిల్లలను చూచేసరికల్లా వారిలో తన ఇందిర రూపం ప్రతిఫలించడము కనుగొనేవాడు నిర్జీవుడైన జీవన్. అతని శూన్యదృష్టులకు ఎల్లప్పుడును చిరునవ్వులొలికించెడి ఇందిర నయనాలు గోచరించెడివి. తనకు ఇందిరను వదలినది మొదలు దినము యొక యుగమువోలె నున్నది. ఆ పితృహృదయానికి వెంటనే తన ముద్దు పాప ఎచ్చటనుంటె అచ్చోటకుపోయి ఆ చిన్నారి చిలిపితో ఆడుకోవలెనని తట్టింది. తాను తన ముద్దులపట్టితోపాటు యుండడమే ప్రధానమనుకున్నాడు. తన చిన్ని కూతురుతో కలసి కలో గంజో త్రాగి బతుకుదామని జీవన్ మరల యింటికి పోవ నిశ్చయించుకొన్నాడు..

జీవన్ నవజీవన్ అయాడు. రైల్వే స్టేషనుకు పరుగు పరుగున పోయాడు, రైలు "కుయ్యి" కూస్తోంది, గవ్వన ఎదురుగానున్న పెట్టెలో ఎక్కి చతికిలాపడ్డాడు. రైలు తన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.....................

"టికట్" అన్నాడు ఆ గుజ్జంమూర్తి T. C. జీవన్ శూన్యదృష్టులను ప్రసరించాడు.

"మీ తాతగారి బండి అనుకున్నావా? టిక్కెట్ లేకుండా ప్రయాణం సాగించడానికి."

జీవన్ తనయొక్క చరిత్రనంతా ఆ కర్కశ హృదయునకు తెల్పి రక్షించమని ప్రార్థించాడు. కాని అతని పలుకులు ఆ కఠినహృదయాన్ని కరిగించలేకపోయాయి. జీవన్ తన శాయాశక్తుల అతనిని బ్రతిమాలాడు. చివరకు విసిగి ఒక తోపుతోసాడు T. C. ని.

క్రిందపడ్డాడు T. C. తలకాయ బ్రద్ధ లయింది. నెత్తురు వరదలై పారింది. జీవన్ కనులు చీకట్లుక్రమ్మేయి. పశ్చాత్తాపపడ్డాడు. కాని గత జల సేతుబంధనం అయింది అతని పశ్చాత్తాపం.

.....................

T. C. ని కూనిచేయదలచినట్లు నేరం నిరూపించి పన్నెండు వత్సరములు కఠినశిక్ష విధించారు.

.....................

విడుదలదినంవచ్చింది.

జైలు Compond పైకివచ్చి స్వచ్ఛమైన గాలిని పీల్చాడు. జుత్తుగెద్దగూడులాగ వుంది. పెద్ద గెడ్డం. తల, గెడ్డం తెల్లగా నెరసిపోయింది. మనిషి చిక్కి సగమయినాడు, నల్లగా బొగ్గులా మారిపోయింది శరీరఛాయ. పోల్చుట చాలాకష్టం.

తనగ్రామం చేరుకున్నాడు. ఇప్పుడది పల్లె గాదు. పెద్ద పట్టణమయింది. సందులన్నితిరిగి తన కుటీరాన్ని చేరుకున్నాడు. తనఇందిర ఎదురుగావచ్చి కౌగలించుకుంటుంది. అనుకున్నాడు. కాని తన పెద కుటీరం కూలిపడియుంది వెఱ్ఱిచూపులు నాల్గువైపుల ప్రసరించాడు. ఆవీధిలో పిల్లలు వెఱ్ఱివాడని రాళ్లు రువ్వుతున్నారు. నలుగురు ఆతనిచుట్టు చేరారు. వాళ్ళని తనయింటిసమాచారం అడిగాడు ఎవరు తెలీదన్నారు. ఇంతలో ఒకతాతవచ్చి "నీపేరుఏమిటోయి?" అని ప్రశ్నించాడు

"జీవన్‌లాల్, బొందిలీజాతి"

"ఏమిజీవన్! యిలాయున్నావు?" అని ప్రశ్నించాడు.

"మా ఇందిరఏది?" అన్నాడు జబాబుగా.

"నీవువెడలిన తరువాత మరుచటివత్సరము ప్లేగువచ్చి చాలామందిని పొట్టపెట్టుకుంది. ఆ అభాగ్యులలో మీఇందు, జమునా..."

"ఆ..." అంటూ మూర్ఛపోయాడు. నలుగురు సేదదీర్చ యత్నించారుకాని వారిదికూడ నిష్ఫలమయింది!